క్లుప్తంగా

2న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2వ తేదీన 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కస్తూరి అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 40 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్న 153 మంది పూర్వ విద్యార్థులందరూ సమ్మేళనానికి హాజరుకావాలని కోరారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించడంతో పాటు సమాజ సేవా కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

13 మంది జూదరుల అరెస్ట్

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో పేకాట శిబిరంపై ఉయ్యూరు రూరల్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. రూరల్ మండలం రామవరప్పాడు ప్రధాన గ్రామంతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా పారుదలకు నోచుకుని డ్రెయిన్లను గుర్తించి గురువారం పూడిక తీశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ.. అంతర్గత రహదారులతో పాటు జాతీయ రహదారిపై డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగు నీరు సజావుగా పారడం లేదని పంచాయతీకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను పారిశుద్ధ్య సిబ్బందిచే పూడిక తీయించామన్నారు. చెత్తను కూడా ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

నున్న గ్రామ పంచాయతీ సమావేశం వాయిదా

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో నిర్మించాల్సిన డ్రెయిన్ల నిర్మాణం గురించి చర్చించిన పిమ్మట తీర్మానాలు ఆమోదం కోసం సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన సమావేశానికి హాజరైన సభ్యులు డ్రెయిన్ల నిర్మాణంపై చర్చించి అంచనాలు తయారు చేయాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని కోరారు. ఫిబ్రవరి నెల 23వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సమావేశం వాయిదా వేసినట్లు కార్యదర్శి చెప్పారు.

క్రీడల్లో గొడవర్రు విద్యార్థుల రాణింపు



కంకిపాడు: క్రీడల్లో రాణిస్తూ గొడవర్రు జెడ్పీ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. హెచ్ఎం కె.సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ వక్కలగడ్డ రాము క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గతేడాది నవంబర్‌లో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో 17 ఏళ్ల బాలుర విభాగంలో బుస్సా అశ్విన్ షాట్‌పుట్‌లో రాష్ట్ర ప్రథమ స్థానం, డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో డిసెంబరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. అండర్–14 బాలికల విభాగంలో మెండె రిషిత లాంగ్‌జంప్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిందన్నారు. ఈ ఏడాది జనవరిలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిందని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటుతున్న క్రీడాకారులను స్థానిక పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీగంగ, డి.లీలాకృష్ణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నున్న(విజయవాడరూరల్): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నున్న రైతు సేవాకేంద్రంలో గురువారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు తమకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. సమాచార హక్కు చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేవలం పది రూపాయలు చలానా చెల్లించి మీకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వం నుంచి తెలుసుకోవచ్చని చెప్పారు. వ్యవసాయం, రెవెన్యూ, విద్య, ఉద్యానశాఖ, ప్రభుత్వంలోని వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్, ఉద్యానశాఖ అధికారి వి.నీలిమ పాల్గొన్నారు.

శిథిలమవుతున్న మత్స్యశాఖ భవనాలు

- అందని మత్స్య శాఖ సేవలు
- పిచ్చి మొక్కలతో నిండిన ప్రాంగణం



పోరంకిలో మత్స్యశాఖ ప్రాంగణం

పెనమలూరు: పోరంకిలో మత్స్య శాఖ కార్యాలయం ప్రాంగణం దారుణంగా మారింది. విలువైన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రాంగణం పిచ్చి మొక్కలు, విష కీటకాల సంచారంతో భయానకంగా మారింది. మత్స్య సేవలు ఈ ప్రాంత మత్స్యకారులకు అందకుండా పోయాయి. వివరాల్లోకి వెళితే.. పోరంకిలో ఎకరం పైగా విలువైన స్థలంలో మత్స్యశాఖ ఏడీ కార్యాలయం గతంలో ఉండేది. అప్పట్లో ఇక్కడ చేప పిల్లల ఉత్పత్తి జరిగేది. మత్స్యకారులు చెరువుల్లో చేపల సాగుకు ఇక్కడి నుంచి సీడ్ అందచేసేవారు. ఆ తరువాత మత్స్య శాఖ నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో చేప పిల్లల ఉత్పత్తిని నిలిపివేశారు. ఆ తరువాత మత్స్యశాఖ ఏడీ కార్యాలయంలో తూర్పు కృష్ణా ప్రాంతం మత్స్యకారులకు కార్యాలయం ద్వారా సేవలు అందేవి. చెరువుల వేలం పాటలు, సొసైటీల నిర్వహణ, మత్స్యకారులకు మెలకువలు తెలిపే విధంగా శిక్షణ తరగతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మత్స్యకారుల రాకపోకలతో ప్రాంగణం సందడిగా ఉండేది.

జిల్లా విభజనతో తరలింపు..

ఉమ్మడి కృష్ణా జిల్లా విభజనతో కొత్తగా ఎన్టీఆర్ జిల్లా ఆవిర్భవించింది. దీంతో పోరంకిలో ఉన్న ఏడీ కార్యాలయాన్ని విజయవాడకు తరలించారు. ఈ ప్రాంత మత్స్యకారులకు గుడివాడలో ఏడీ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో పోరంకి మత్స్య శాఖ ప్రాంగణం ఖాళీ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ మత్స్యశాఖ కార్యకలాపాలు నిలిచి పోయాయి. భవనాలు ఉపయోగించక పోవటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలు కూలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ఫర్నిచర్ పాడైపోయింది. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి అడవిలా మారింది. విష కీటకాల సంచారం పెరిగింది. ప్రాంగణంలో అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంగణంలో ఉన్న ఒక్క ఉద్యోగిని ఉదయం వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లటం తప్ప ఎటువంటి కార్యకలాపాలు లేవు. కనీసం మత్స్యకారులకు సూచనలు, సలహాలు ఇచ్చే అధికారులు ఎవరూ ఇక్కడ కనబడటం లేదు.

ప్రాజెక్టులు వస్తాయని ప్రచారం

పోరంకి మత్స్యశాఖ ప్రాంగణంలో మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులు వస్తాయని ప్రచారం జరుగుతుంది. అయితే అటువంటి ఆనవాళ్లు ఇక్కడ కనబడటం లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రాజెక్టులు వస్తాయనే ఆశ కూడా మత్స్యకారుల్లో కనబడటం లేదు. ప్రస్తుతానికి రూ.12.5 లక్షలతో ప్రాంగణం ఆక్రమణలు జరగకుండా ఒక పక్క గోడ నిర్మాణం చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎంతో ఉపయోగకరమైన స్థలం ఇక్కడ అందుబాటులో ఉన్నందున మత్స్యకారుల ఉపాధికి, మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. అలాగే ప్రాంగణంలో మత్స్య ఉత్పత్తులు అమ్మకాలు చేయటానికి మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలమైన ఏడీ కార్యాలయం

మహాత్ముని ఆశయాలు స్ఫూర్తిదాయకం



నున్నలో నివాళులర్పిస్తున్న నాయకులు



పోరంకిలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యూరు: జాతి పిత బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకమని ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహాత్ముడి చిత్రపటానికి ఎంపీడీఓ శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో మహాత్ముడికి నివాళులర్పించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ పోరాటం

నున్న(విజయవాడరూరల్): భారతదేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ షేక్ హుస్సేన్, గ్రామ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు భీమవరపు శివరామిరెడ్డి, అంగజాల హనుమా, బొమ్మిన శ్రీనివాసరావు, భీమవరపు ముత్తారెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు మరువలేనివి

పెనమలూరు: దేశ స్వాతంత్ర్య కోసం అమర వీరులు చేసిన త్యాగాలు మరువలేనివని ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు అన్నారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో గురువారం గాంధీ వర్ధంతి, అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా చేశారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు మాట్లాడుతూ.. అమరవీరులు చేసిన త్యాగాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు రాము, రత్నకుమారి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్ముని జీవితం ఆదర్శనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అతి సామాన్య కుటుంబంలో జన్మించి జాతిపితగా ఎదిగిన మహాత్మాగాంధీ జీవితం నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని రేమల్లే జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.లూథర్ పాల్ అన్నారు. బాపులపాడు మండలం రేమల్లేలోని జెడ్పీ హైస్కూల్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. పెరికీడు వంతెన వద్ద జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి గాంధీజీ అందించిన సేవలను కొనియాడారు.

ప్రణాళిక, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మారాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: చక్కటి ప్రణాళిక, సమయపాలన, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గుడివాడ డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి వై.పద్మారాణి అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. తరగతుల వారీగా విద్యార్థుల హాజరు, పరీక్షల్లో సాధించిన మార్కులను సమీక్షించారు. పాఠ్యాంశాల బోధన, తరగతి గదుల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీ చేశారు. దస్తూరిలో మంచి ప్రతిభ కనపర్చిన ఆరో తరగతి విద్యార్థులు వాణి, అభీదాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం కావాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డీవైఈఓ పద్మారాణి ఆకాంక్షించారు. కష్టంగా భావించకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించగలరని సూచించారు. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పాటించాల్సిన పలు అంశాలను ఆమె వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాత మృతుడికి రూ.5 లక్షల పరిహారం మంజూరు

కంకిపాడు: విద్యుదాఘాత మృతుడికి ఉప లోకాయుక్త ఆదేశాలతో మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం మంజూరు చేసిందని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పునాదిపాడు గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో వ్యవసాయ మోటారు మరమ్మతులు చేస్తూ గతేడాది ఆగస్టు 15న విద్యుదాఘాతానికి గురై వీర్ల మల్లికార్జునస్వామి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వీర్ల బాలవర్ధినికి విద్యుత్ శాఖ ఆర్థిక సాయాన్ని మంజూరు చేయాలని అదే నెల 17న ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశానన్నారు. ఉప లోకాయుక్త ఏపీఈఆర్‌ఈసీకి ఉత్తర్వులు జారీ చేయటంతో మృతుడి భార్య బాలవర్ధినికి రూ.5 లక్షలు పరిహారాన్ని విద్యుత్ శాఖ మంజూరు చేసిందని చెప్పారు.

కొనసాగుతున్న వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టుల పర్వం

గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టుల పర్వం కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో ఎటువంటి సంబంధం లేని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్యను గురువారం పోలీసుల ద్వారా సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి ఘటనపై మొదట 44 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మరో 36 మందిని నిందితుల జాబితాల్లో చేర్చారు. ఈ దాడి జరిగినప్పుడు ఘటన స్థలంలో లేని తోట వెంకయ్యతో పాటు అనేక మందిని ఈ కేసులో ఇరికించి వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలపై వీరంతా న్యాయ పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముసునూరు మండల పరిధిలో ఉన్న వెంకయ్యను గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను సీఐడీ అధికారులు తమ అధీనంలోకి తీసుకుని తాడేపల్లిలోని కార్యాలయానికి తరలించారు. ఆయనను శుక్రవారం కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. తోట వెంకయ్య అక్రమ అరెస్టును పలువురు వైఎస్సార్ సీపీతో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు సైతం తీవ్రంగా ఖండిస్తున్నారు.

దర్శనాల దళారీపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దర్శనాలు చేయిస్తానని భక్తుల దగ్గర భారీగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న దళారీపై గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన కారుబిల్లి శ్రీనివాసరావు (58) కనకదుర్గానగర్‌లో కొబ్బరికాయలు విక్రయిస్తున్నాడు. రద్దీ రోజుల్లో అమ్మవారి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దర్శనం చేయిస్తానంటూ శ్రీనివాసరావు వారి నుంచి డబ్బుల వసూలు చేస్తున్నాడు. ఆలయ సిబ్బందితో సంబంధాలు పెట్టుకొని కొన్ని టికెట్లు తీసుకొని వారికి దర్శనాలు చేయించటం చేస్తుంటాడు. దీనిని గుర్తించిన ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా



చైతన్యరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చక్రవర్తి

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుంటక చైతన్యరెడ్డి భౌతిక కాయాన్ని గురువారం చక్రవర్తి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతిమయాత్రలో పాల్గొని చైతన్యరెడ్డి సేవలను కొనియాడారు. చక్రవర్తి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలన్నారు. ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, నాయకులు త్రిపురం చందు, భీమవరపు కోటిరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బొమ్మారెడ్డి రవీంద్రారెడ్డి, బోళ్లపాడు సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి బల్లల వితరణ



సిమెంట్ బల్లలు అందజేస్తున్న మానవత సభ్యులు

గన్నవరం: రోగుల సౌకర్యార్థం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మానవత స్వచ్ఛంద సంస్థ 10 సిమెంట్ బెంచీలను వితరణ చేసింది. ఈ మేరకు గురువారం సంస్థ రాష్ట్ర అధ్యక్షులు మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.40 వేలు విలువైన సిమెంట్ బల్లలను ఆస్పత్రికి వచ్చే రోగులు కూర్చోనేందుకు అందజేసినట్లు తెలిపారు. బల్లల వితరణకు ముందుకువచ్చిన సంస్థ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ, సంస్థ గన్నవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మదుపల్లి బాలకృష్ణమూర్తి, కర్రా వరప్రసాదరావు, సభ్యులు మోటమర్రి శేఖర్, ముక్కామల సుబ్బారావు, పొట్లూరి రామకృష్ణారావు, వీసం ప్రసాదరావు, పలగాని శివాజీ, దోనవల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ కారణంగా సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న అధికారులు

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుదీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అధికారులు ఎటువంటి తీర్మానాలు లేకుండా సమావేశాన్ని ముగించారు. వైస్ ఎంపీపీ–2 కాలగడ్డ శివ నాగరాజకుమారి, ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఫిబ్రవరి 1వ తేదిన జరగనున్న బాలోత్సవం పిల్లల పండుగను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నె వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా వేశామన్నారు. ఈ విషయాన్ని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని కోరారు. కార్యక్రమం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదు

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే అంశంపై గురువారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రశ్నకు సంబంధించి జవాబు రాసే విషయంలో ఏదైనా సమస్య ఉత్పన్నమైె దాని గురించే దీక్షగా ఆలోచన చేయడం ద్వారా ఒత్తిడికి గురవుతారని డాక్టర్ బి.రమేష్ చెప్పారు. అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విజయాభవ కార్యక్రమం ద్వారా ఎగ్జామ్స్ స్ట్రెస్‌ను అధిగమించడంపై డాక్టర్ బి.రమేష్, సైకాలజిస్ట్ అనిత అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.రవిప్రసాద్, నళినిరామ్, నాగేశ్వరరావు శ్రీలత పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



పెనమలూరు: యువత క్రీడలపై ఆసక్తి చేపాలని పెనమలూరు సీఐ జె.వెంకటరమణ అన్నారు. కృష్ణా జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం జిల్లా స్థాయి క్రీడల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటరమణ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా క్రీడల్లో పాల్గొనాలన్నారు. దీని వలన క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెరుగుతుందని చెప్పారు. వాలీబాల్‌లో వీఆర్ సిద్ధార్థ జట్టు, కబడ్డీ మహిళల్లో విజయ ఇంజినీరింగ్ కాలేజీ, బ్యాడ్మింటన్ పురుషులు, మహిళా విభాగాల్లో ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీ జట్లు గెలిచాయి. కాలేజీ డైరెక్టర్ బావినేని పాండురంగారావు, నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, పలువురు పాల్గొన్నారు.

హీరో న్యూ డెస్టినీ 125 సీసీ స్కూటర్ ఆవిష్కరణ



స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాలిన్‌బాబు తదితరులు

పెనమలూరు: కానూరు సాయి స్వర్ణిక మోటార్స్‌లో గురువారం హీరో కంపెనీకి చెందిన న్యూ డెస్టినీ 125 సీసీ స్కూటర్‌ను పారిశ్రామిక వేత్త స్టాలిన్‌బాబు ఆవిష్కరించారు. హీరో మోటో కార్ప్ నేషనల్ హెడ్ సంజయ్‌శుభాష్‌షెజ్‌వాల్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ, సరికొత్త హంగులతో అద్భుతమైన ఫ్యూచర్స్‌తో ప్రజలకు అందుబాటులోకి స్కూటర్ మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. ఎక్స్‌షోరూమ్ ధర రూ.82,950 అన్నారు. కార్యక్రమంలో ఏసీఎం అర్జున్, ఏరియా సేల్స్ మేనేజర్ కిరీటి, సర్వీస్ మేనేజర్లు చంద్రశేఖర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అద్భుత బాలయేసు ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి అద్భుత దివ్య బాలయేసు మహోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరియమ్మ, బాలయేసు, ఏసుక్రీస్తు విద్యుత్ దీపాల ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిల్చాయి. ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన నవదిన ప్రార్థనలకు రెక్టార్ ఫాదర్ పెయ్యాల మరియదాసు, జ్యోతినగర్ విచారణ గురువు చేబ్రోలు జోసఫ్ తంబి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

పెనమలూరు: కుష్టు వ్యాధిపై అందరికీ అవగాహన అవసరమని పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు తెలిపారు. పెనమలూరు సచివాలయం – 2లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్టు వ్యాధిపై అవగాహన పక్షోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తారన్నారు. వైద్యుడు బిజిలీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శరీరంపై స్పర్శ తగ్గితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన అధికారులు

విజయవాడరూరల్: ఫిబ్రవరి 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని విజయవాడ రూరల్ తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి బి.సుగుణ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో సగటున 800 మంది ఓటర్లు ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీఓ బి.విగ్గిన్స్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని చెప్పారు. రాజకీయ పార్టీ సమావేశాలు నిర్వహించరాదని, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టరాదని తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ బేబిసరోజిని, రామవరప్పాడు వీఆర్వో రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

ఉంగుటూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున నియమావళిని పాటించాలని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులో జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం 83ను గురువారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణకు అవసరమైన రాంప్, వాటర్, ఫర్నిచర్, లైటింగ్ వంటి వసతులను తనిఖీ చేశారు. మండలంలో ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం 1122 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఉంగుటూరు ఎస్ఐ గోవిందు, హెచ్ఎం సీహెచ్ అనిత పాల్గొన్నారు.

కుమార్తె వద్దకు కుంభమేళాలో తప్పిపోయిన వృద్ధురాలు

నున్న(విజయవాడరూరల్): కుంభమేళాలో తప్పిపోయిన వృద్ధురాలిని పోలీసులు ఆమె కుమార్తె వద్దకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కుంభమేళా స్నానాలకు వెళ్లిన నున్న గ్రామానికి చెందిన భూముల జయలక్ష్మి(80)అనే వృద్ధురాలు స్నానాలు ముగించుకొని ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుండటాన్ని పోలీసులు గమనించారు. నున్న గ్రామం నుంచి ఒంటరిగా వచ్చిన జయలక్ష్మి రెండు రోజుల క్రితం జరిగిన తొక్కిసలాటలో ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడ్డారు. వృద్ధురాలిని ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రయాగరాజ్, ఎంజీ మార్గ్‌లోని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. నున్న గ్రామం నుంచి వచ్చినట్లు తెలుసుకున్న పోలీసులు నున్న పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఏఎస్ఐ కృష్ణ నున్న గ్రామం వచ్చి స్థానిక మహిళా పోలీసు(ఎంఎస్‌కె) ల ద్వారా సమాచారం తెలుసుకొన్నారు. జయలక్ష్మి అనే వృద్ధురాలు కుంభమేళాకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు చండీఘర్‌లో ఉంటున్న జయలక్ష్మి కూతురు ఇంటికి సురక్షితంగా తరలించినట్లు సమాచారం.